# అల

ఆ అక్షరాలు పెద్దవైపోతూ, తనను చుట్టేస్తూ, విడిపోతున్న అందమైన అనుభూతి, ఒక ఆర్తిని అక్షరబద్ధం చేస్తే దానికి గుండెలను చీల్చే శక్తి ఉంటుంది కాబోలు. పార్వతి అశాంతిగా అటు నుంచి ఇటు వత్తిగిల్లింది. చేయి అందే దూరంలో భాస్కర్ నిద్రపోతున్నాడు. అతని వైపు కాసేపు దీక్షగా చూసింది పార్వతి. మనసులో ఎక్కడో గిల్టీ ఫీలింగ్. 'ఇతని జీవితంలో ఏదైనా రహస్యం ఉందా' సమాధానం ఉండదు అని వెంటనే వచ్చేసింది.

అవకాశం ఏదీ? ఉదయం నిద్రలేచిన దగ్గర నుంచి, గంటకో బ్యాచీ చొప్పున మూడు గంటలపాటు క్లాసెస్. ఆ తరువాత కాలేజి. సాయంత్రం రావటం కప్పు టీ తాగటం. మళ్ళీ క్లాసెస్ తీసుకోవటం. ఎం.సెట్ కోచింగ్‌లో అతన్ని మించిన వాళ్ళు లేరు. ఆ జీవితంలో స్పందనలకు, ఉద్వేగాలకు చోటు లేదు గాక లేదు. మరి తన అశాంతి మాటేమిటి? తనలా ఆలోచించటమే తప్పు. కళ్ళు మూసుకుని నిద్ర పోయేందుకు గట్టి ప్రయత్నం చేసింది. వద్దు వద్దన్నా కళ్ళ ముందు అదే దృశ్యం.

కంప్యూటర్ సెక్షన్‌లో ఫోన్ డెడ్. చాలాసార్లు ప్రయత్నించి విసిగిపోయి లేచి వచ్చేసరికి, అతనొక్కడే కంప్యూటర్‌లో ఏదో కొత్త డిజైన్ చేస్తున్నాడు. ఆసక్తి కొద్దీ అతన్ని డిస్టర్బ్ చేయకుండా ముందుకు నడిచింది. కంప్యూటర్ స్క్రీన్ మీద పార్వతి అన్న అక్షరాలు చీరకొంగు అంచుల్లాగా అలల్లా కదులుతున్నాయి. శశి అన్న బ్లాక్ లెటర్స్‌ని పార్వతి అన్న అక్షరాలు చీర కొంగు కప్పేసినట్లు కప్పేస్తూ, వెనక్కొస్తూ... పార్వతి కాళ్ళు వణికాయి. ఎర్రబడిన అతని కళ్ళు, ఏకదీక్షతో స్క్రీన్ మీద అతను దృష్టి నిలిపిన తీరు... ఒక్క సెకండ్‌లో అతను మనిషి అలికిడి పసిగట్టి స్క్రీన్‌మీద అక్షరాలు మాయంచేశాడు. వెనక్కి తిరిగి తనవైపు తిరిగిన అతను నిర్ఘాంతపోవటం... పార్వతి తేరుకొని గబగబా ఛాంబర్‌లోకి వచ్చి పడింది. ముందుగా విపరీతమైన కోపం వచ్చింది. ఎంత సాహసం. ఆమె ఆలోచించుకొనేలోగానే తలుపు తెరుచుకొని వచ్చేశాడతను. ఆమె మాట్లాడేలోగానే గబగబా చెప్పేశాడు తనేం నొచ్చుకోకూడదట. ఉచితానుచిత జ్ఞానం లేదా అని తను అడగవచ్చుట. బట్, ఒక ఫీలింగ్. ఒక మనిషిని చూడగానే కలిగే ఆత్మీయతా భావన, ఆరాధన జీవితంలో ఒక్కసారే కలుగుతుందిట. అది తన తప్పు కాదట. అతను ఎంతో ఆలోచించాడట. నిస్సహాయంగా ఉండిపోయాడట. ఒక భావావేశం, స్ఫూర్తి కలిగిన ఒక రూపాన్ని ఆరాధించడం తప్పుకాదట. జీవితంలో ఎప్పటికీ చెప్పుకోలేక పోతానే, చెప్పుకోగలిగే అవకాశం లేదే అని తపించేవాడట. ఈ రోజు అనుకోకుండా తన కోరిక నెరవేరిందట. ఏ రకంగానూ డిస్టర్బ్ చేయడట...

అతను విసురుగా వేసిపోయిన తలుపు గబగబా కొట్టుకోవటం, నెమ్మదిగా సర్దుకోవటం కళ్ళతో చూస్తుంటే తన పరిస్థితి అలాగే ఉందనిపించింది. త్రీబెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌లో తను వాడుకొనేది రెండే గదులు. బెడ్‌రూమ్, అటు నుంచి వంటింట్లోకి దారి. ఉదయం ఆరు గంటలకు నిద్రలేస్తే, బెడ్‌రూమ్‌లోంచి వంట గదిలోకి అడుగుపెడితే ఇక అందుట్లో శబ్దం రాకుండా వంట చేయాలి. గిన్నెల శబ్దాలు నిషేధం. మిగతా రెండు గదుల్లో కోచింగ్ కోసం వచ్చే స్టూడెంట్స్. వాళ్ళకి ఏ శబ్దాలూ వినబడకూడదని భాస్కర్ ఆదేశం. పాదాలు కూడా సవ్వడి చేస్తాయేమోనని తను నెమ్మదిగా నడుస్తూ, జాగ్రత్తగా వంట వండటంతో అదే దీక్ష, కర్తవ్యం అయిపోతూ వేరే ఆలోచన రానివ్వని క్షణాలు. పది గంటలకి ఇక ఆఫీస్. మళ్ళీ సాయంత్రం ఐదు గంటల నుంచీ శబ్దాలు వినపడని ప్రపంచంలో పాటలు, కదిలే బొమ్మలు దేనికీ చోటులేదు. నిశ్శబ్దం రూపం దాల్చినట్టు శిలలా ఉండిపోవలసిందే. ఒకవైపు కాలేజీ, ఇంకోవైపు ట్యూషన్స్‌తో భాస్కర్‌కి ఇంకో ప్రపంచం లేదు. ఇంకో ఆలోచనా లేదు. జీవితం అంతా అర్థంలేని పరుగుతోనే గడిచిపోతూ... అలసిపోతూ... సంభాషణకే అవకాశం లేనిచోట ఇన్ని మాటల వర్షం. ఎన్నడూ లేని ఆలోచనల హోరు. ఎన్నోసార్లు 'నా కొత్త కవిత చదివారా మేడమ్' అంటూ శశికాంత్ తెచ్చి ఇచ్చిన పేపర్ కటింగ్స్ సొరుగు లోంచి తీసి చూసింది. పార్వతీదేవికి ఉన్న పర్యాయ పదాలు ఏదో ఒకటి ప్రతి కవితలోనూ ఏదో ఒక సందర్భంలో

అందంగా ఇమిడిపోయాయి. పేజీ తిప్పుతున్నకొద్దీ ఒక్కో కొత్త కోణం కనిపిస్తోంది. ప్రేమనే పాతబడిపోయిన అక్షరాలు కొత్త కొత్తగా రంగులు మారుస్తూ కంప్యూటర్ స్క్రీన్ మీద కనిపిస్తున్నట్లుంది. ఫైల్ తీసుకొని, అతను తలుపు నెట్టుకొని లోపలికి రాగానే ఎప్పటిలా, రొటీన్‌గా విష్‌చేసి, చేత్తో కూర్చోమని సైగ చేయటం, అతను తెచ్చిన ఫైల్ మీద సీరియస్‌గా సంతకాల పనిలో పడిపోవడం రోజువారీ కార్యక్రమం. రోజూ లాగానే శశికాంత్ వస్తూనే విష్ చేశాడు. ఒక ఇబ్బంది, ఒక తడబాటు. పార్వతి మొహం దించుకుంది. నెర్వస్‌గా వణికిపోతున్న చేతులు గుప్పిట బిగించింది. అతను ఫైల్ టేబుల్ మీద ఉంచేసి తల వంచుకొని వెళ్ళిపోయాడు. అరగంట తర్వాత అతని లీవ్ లెటర్ మీద సంతకం చేస్తూ 'ఒంట్లో బావుండ్లేదా శశీ!' అనేందుకు పార్వతికి గొంతు సహకరించలేదు. అతను వెళ్ళిపోతూ ఒక కవరు ఆమె ముందు ఉంచాడు. శ్రీమతి పార్వతి అని అడ్రస్ చేసిన ఆ కవర్‌ని చాలాసేపు చూసింది పార్వతి. క్షమించమని రాశాడా? పొరపాటు చేశానన్నాడా? ఏమంటున్నాడు. వణికే చేతుల్తో కవర్ ఓపెన్ చేసింది పార్వతి. అందమైన అక్షరాల వరుసలు....

'ఎన్నెన్నో నిద్ర రాని రాత్రులూ... కన్నీటిలో తడిసిపోయిన రోజులూ అయ్యాక... వాస్తవం వీపు చరిచాక రాజీపడిన ఒక విషాదానుభవం గురించీ... తనను కవిగా మార్చిన ఎప్పటికీ తనకు అనుభవంలోకి రాని రహస్య ప్రణయం గురించీ...

మరో అందమైన కవితావేశం ఆ ఉత్తరం.

పార్వతి అంతా చదివాక, ఉత్తరం మడిచి బ్యాగ్‌లో పెట్టుకొంది ఆమెకు ఎందుకో నవ్వొచ్చింది. శశికే కాదు... తనకు మటుకు ఎప్పటికైనా ఆ ఆవేశపు అంచునైనా తాకగలిగే అవకాశం వస్తుందా? పార్వతి కళ్ళు తెరిచి ఇంటి కప్పు వైపు చూస్తూ పడుకొంది. తాళాలు బిగించిన ఓ పెద్ద తలుపుకి ఆవలివైపున అతను నిలబడి ఉన్నట్లు ఓ ఊహ కలిగింది. తను విపరీతంగా ఆలోచిస్తోందేమో. తనని తానే ఓదార్చుకొంది. మనుషులం కదా... స్పందిస్తాం... మనుషులం కదా ఆలోచిస్తాం. మనుషులం కదా, సంయమనంతో ప్రవర్తిస్తాం. గిరగిరా తిరుగుతున్న ఫ్యాన్‌వంకే చూస్తూ ఉంటే ఎప్పటికో... ఎప్పటికో... కళ్ళు మూతలు పడ్డాయి.

★ ★ ★

పిల్లిలా అడుగులు వేస్తూ గిన్నెలు సర్దుతుంటే పార్వతీ అంటూ భాస్కర్ కేక పెట్టాడు. ఎన్నడూ లేంది భాస్కర్ పేరు పెట్టి పెద్దగా పిలుస్తున్నాడు. 'ఆ...' అనే లోపలే వంటింట్లోకి వచ్చేశాడు. అతని చేతుల్లో శశి రాసిన ఉత్తరం 'సిగ్గు లేదూ... చదువుకొన్నావు సంస్కారం లేదూ...' భాస్కర్ ముఖంలో అంతులేని అసహ్యం. పార్వతి తడబడింది. మాట్లాడేలోపునే భాస్కర్ పార్వతి జుట్టు అందుకొన్నాడు. మొఖం మీద చెంపల మీద దెబ్బల వర్షం... 'ఛీ. నీ

బతుకు చెడ' అతను విసురుగా వెనక్కి నెడితే... అరుగు తాకి, నుదురు నెత్తురు వరదలై పోతూ కిందికి జారిపోయింది పార్వతి. నొప్పినో, వేదననో భరించగలిగేంత వరకే మెదడు పనిచేస్తోంది అదో అదృష్టం. స్పృహ తప్పిపోతుంటే ఆసరా కోసం చేతులతో గాలిలో వెతకటం వరకే గుర్తుంది పార్వతికి. ఎప్పటికో కళ్ళు తెరిచేసరికి ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. నుదుటి మీద గాయం రక్తం కారటం ఆగిపోయి ఈగలు ముసిరిపోతూ పార్వతికి మెలకువ తెప్పించింది. లేచి ముఖం కడుక్కుని ముందు గదిలోకి వచ్చేసరికి ఫోన్ రింగవుతోంది. అవతల నుంచి మేనేజర్ సాంబమూర్తిగారు మాట్లాడుతున్నారు 'శశిని అరెస్ట్ చేశారు మేడమ్?'

ఎందుకు? ఏం జరిగింది?

పార్వతికి అయోమయంగా ఉంది.

సెవన్ టౌన్ సి.ఐ. గారు స్వయంగా రెయిడ్ చేశారట. శశి అపార్ట్‌మెంట్‌లో ఏదో నిషేధ సాహిత్యం దొరికిందిట మేడమ్. ఈ రోజు నేను లీవ్ తీసుకొంటానండి. శశికి బెయిల్ ఇచ్చేందుకు ఏదైనా ఏర్పాటు చేయాలి.

సరే అంది ఫోన్ పెట్టేస్తూ పార్వతి.

భాస్కర్ వాళ్ళ అన్నయ్య దగ్గరకు వెళ్ళి ఉంటాడు. ఒక్క ఉత్తరం... ఏమిటిది, ఎలా వచ్చింది అని అడగనూ లేదు. పార్వతిని అవమానిస్తున్నానే అన్న వేదనా లేదు. తనతో కలిసి బతుకుతున్న ప్రాణం ఉన్న మనిషికి, కాగితానికి ఉన్న విలువ లేదా. తనకు చెందిన ఒక వస్తువు, హక్కు భుక్తం, ఇంకొకరి దృష్టి పడిందన్న ఊహతోనే ఇంత విపరీతానికి పూనుకోవాలా? అసలు తనెవరు? పార్వతి అనే వ్యక్తి కాదు. భాస్కర్ కొనుక్కున్న బొమ్మ. అతను కీ ఇస్తే, వంట వండీ, పడక సుఖం ఇచ్చే తలవూపే బొమ్మ. ఒక నవ్వు మాట, ఆనందం ఇవేవీ లేని ఒక ఎడారి వంటి జీవితంలోనూ తనకు కష్టం తోచలేదే! చాలా సహజంగా ఊపిరి పీల్చినంత సహజంగా అందులో ఇమిడిపోయింది. ఏమిటి, ఎందుకు? అన్న ప్రశ్నలకు తావివ్వని తన బతుకే ఇప్పుడో ప్రశ్నార్థకం!

కళ్ళు తిరుగుతున్నాయి పార్వతికి. ఎంత పనిచేశాడు భాస్కర్. పోయి వాళ్ళన్నతో చెప్పుకొని ఉంటాడు. అతను వెంటనే లేచి, యూనిఫాం తగిలించుకొని రెయిడ్ పేరుతో శశిని చుట్టుముట్టి ఉంటారు. ఇంటరాగేషన్ పేరుతో ఇప్పటికే శశి చర్మం వలిచి పారేసినా ఆశ్చర్యం లేదు. ఒక పోలీస్, ఒక విద్యావేత్త... ఇద్దరి దృష్టిలోనూ పార్వతి, తప్పులు తేలికగా చేయగలిగే ఆడది. నిర్ణయాధికారం తన గుప్పిట్లోనే ఉంచుకోగలిగే ఒక దురహంకారం. ఇంత అన్యాయమా?

పార్వతి నిలువునా వణికింది. యాభై మంది ఎంప్లాయీస్‌ని కళ్ళతోనే శాసించగల ఆఫీసర్

తను. ఊంచిపెట్టి ఒక దెబ్బకొడితే నిస్సహాయంగా వెల్లికిలా పడిపోయింది. సిగ్గుతో పార్వతికి కళ్ళనీళ్ళు వచ్చేసాయి. తలుపు ధడాలుమని తెరుచుకుంది. రౌద్రమూర్తి లాగా వున్నాడు భాస్కర్.

ఏం... నీ రంకు మొగుడి కోసం విచారిస్తున్నావా? నీ బాబు తరం కూడా కాదు వాడిని విడిపించటం. నిమిషాల మీద అన్నయ్య యాక్షన్ తీసుకున్నాడు. వాడి అంతం చూడకపోతే...

రెండు చిటికలు వేసి తనవైపు చూపించుకొని సవాల్ చేశాడు భాస్కర్.

''మీరు పొరపాటు పడుతున్నారు''

పార్వతి చెప్పేలోగానే మీదికి వచ్చేశాడు భాస్కర్.

''ఏమిటే... పొరపాటు పడితే ఏవిటంట? నువ్వూ వాడూ కలిసి నన్ను చంపుతారా? లేచిపోతారా?...'' భాస్కర్ నోటివెంట తిట్ల పరంపర వింటూ గోడకి అతుక్కుపోయింది. అపర సరస్వతీదేవి లాగా స్వచ్ఛమైన భాషా జ్ఞానం, నిరంతర పఠనాసక్తి... ఎప్పుడూ పుస్తకాలతోనే బతికే భాస్కర్ నోటి వెంట వినరాని ప్రేలాపనలు. భాస్కర్ హెచ్చరికలు చేస్తున్నాడు. తను కష్టపడి ప్రతి నిమిషం రక్తాన్ని రూపాయలుగా మార్చి పార్వతి జీవితం పూల పాన్పు చేశాడట. పార్వతి వంటికి పట్టిన కొవ్వు దింపుతానని, శశి బతుకు ఆ కటకటాల్లోనే కడతేరి పోతుందని తేల్చి చెప్పాడు. కాలింగ్‌బెల్ మోగేదాకా భాస్కర్ చేసిన దౌర్జన్యం అంతా భరిస్తూనే ఉంది పార్వతి.

మేనేజర్ సాంబమూర్తి గారు వచ్చారు.

లోపలికి వస్తూనే-

చిందర వందరగా వున్న ఇంటిని, శోకమూర్తి లాగా ఉన్న పార్వతిని చూసి, ఒక్క క్షణం నిర్ఘాంతపోయి నిలబడ్డారాయన. వెంటనే కర్తవ్యం గుర్తు వచ్చిందాయనకు. భాస్కర్ కోసం వచ్చారు సాంబమూర్తి.

భాస్కర్ అన్నగారే స్వయంగా కేసు డీల్ చేశాడు కాబట్టి ఆయనకు నచ్చజెప్పేందుకు భాస్కర్ సాయం కోసం వచ్చారాయన. ఆయనకు విషయం తెలిసినట్లు లేదు.

''శశి చాలా మంచివాడండీ భాస్కర్‌గారూ... ఎవ్వరి జోలికి రాడు. ఆఫీస్‌లో చాలా సిన్సియర్‌గా పనిచేస్తాడండీ... అతనికి కవిత్వం రాసే సరదా ఉంది గానీ, నిషేధ సాహిత్యం దాచిపెట్టుకునే సాహసం లేదండీ... అతను చాలా మామూలు కుర్రాడు.''

చెప్పుకుపోతున్నాడు సాంబమూర్తి. రాయిలాంటి మొహంతో సోఫాలో కూర్చున్నాడు భాస్కర్.

''భాస్కర్‌గారు ఒక మాట చెప్పితే బెయిల్ మంజూరు చేస్తారండీ పార్వతిగారూ'' అంటూ పార్వతితోనూ చెప్పాడు సాంబమూర్తి.

ఇంట్లో, భార్యా భర్తా ఏదో గొడవ పడుతున్నారని, సమయం కాని సమయంలో వచ్చానని పెద్ద మనిషి తరహాలో ఏదో బాధ పడిపోతున్నాడు సాంబమూర్తి.

అంత బాధలోనూ సాంబమూర్తిగారు భాస్కర్‌నే సాయం అడుగుతున్నాడని, డిపార్ట్‌మెంట్ హెడ్‌గా శశికి సాయం చేయగలిగే అవకాశం తనకే ఉందని, సాంబమూర్తి గుర్తించలేదని పార్వతికి తట్టింది. ఏం మగవాళ్ళూ! ఆఫీసరైనా ఆడది ఆడదే! ఈ పబ్లిక్ వ్యవహారాలన్నీ ఆడదానివల్ల కావు. అవన్నీ మగవాళ్ళకే సాధ్యమయ్యే విషయాలు కాబోలు. పార్వతి మనసులో ఒక నిశ్చయం చేసుకుంది.

సాంబమూర్తిగారూ మీరు ఆఫీస్‌కి పదండి. నేను బెయిల్ కోసం ప్రయత్నం చేస్తాను. హెడ్ ఆఫీస్‌కి ఇన్‌ఫాం చేసి ఏం చేయాలో ఆలోచిద్దాం... సాంబమూర్తికి పార్వతి పవర్స్ గురించి ఆలస్యంగా గుర్తొచ్చినట్లుంది.

ఆ... మన ఆఫీస్ దాకా ఎందుకనీ... భాస్కర్‌గారి అన్నగారే గదా. ఒక్క రికమండేషన్... నీళ్ళు నమిలాడు సాంబమూర్తి.

''ముందు మీరు పదండి. మన యు.డి.సి. లు ఇద్దరిని సంతకాల కోసం తీసుకుపోండి. ట్రెజరీకి చెప్పాను. పదివేలు తీసుకోండి. నేను వస్తాను. మీరు పదండి'' పార్వతిలో ఆఫీసర్ నిద్ర లేచింది.

సాంబమూర్తిగారు వెళ్ళిపోయాక, మూసిన తలుపు వెనకాల మొదలైంది సంగ్రామం.

''ఉత్తరం పూర్తిగా చదివి మాట్లాడండి. నా ప్రమేయం ఏదన్నా ఉంటే చెప్పండి...'' అన్నందుకు పార్వతికి మరో నాలుగు దెబ్బలతో సమాధానం చెప్పాడు భాస్కర్.

తనను వెర్రి వెధవను చేసి ఆమె ఆడిన నాటకానికి తను చివరి అంకం, గొప్ప మలుపుతో ముగింపు ఇచ్చానని, ఆమెను అంత తేలిగ్గా సుఖంగా బతకనివ్వనని, జీవితాంతం, ఆమె ఏడుస్తూ బతికేలా చేయగలనని గర్వంగానే చెప్పాడు. పార్వతికి కళ్ళనీళ్ళు రాలేదు. ఏనాడూ వినని తిట్లు, దెబ్బల వర్షంతో మనసు మొద్దుబారి పోతోందామెకు. ఇప్పుడీ సమస్య నుంచి బయటపడటం ఎట్లా? పోలీస్ రికార్డ్స్‌లో ఇలాంటి కేసులో ఇరుక్కుంటే శశి బతుకు ఏమవుతుందో తలుచుకొంటేనూ, ఇన్నేళ్ళ వైవాహిక జీవితం తరువాత కూడా, స్నేహానికి, విశ్వాసానికి, నమ్మకానికి తావులేక పోవటమూ పార్వతిని గాయపరచింది. ఎన్నెన్నో గంటల ఆలోచన తర్వాత లేచి స్నానం చేసి బట్టలు మార్చుకుంది. భాస్కర్ మాస్తూ వుండగానే అన్నయ్య రవికి ట్రంకాల్

చేసింది. వెంటనే బయలుదేరి రమ్మని పరిస్థితి బాగా లేదని చెప్పుతుంటే ఆమె గొంతు వణికింది. ఆమె బయటకు వెళ్తుంటే భాస్కర్ రంకెలు పెట్టాడు.

''ఫోవే... సిగ్గులేనిదానా... వాడితో కులికేందుకు నీకు సిగ్గులేదూ''

పార్వతి లక్ష్యపెట్టకుండా బయటకు నడిచింది. ఆ తరువాత నాలుగు రోజుల వరకూ ఊపిరి తిరగనన్ని పనులు. రవి సాయంత్రానికి వచ్చేశాడు. భాస్కర్‌తో గంటల తరబడి డిస్కషన్స్. తనను మోసం చేసిన పార్వతి అంతు చూస్తానని భాస్కర్ సమాధానం.

''ఇదేమిటి పార్వతి ఇలా చేసుకున్నావు. నీతో ఇలాంటి విషయాలు మాట్లాడవలసి వస్తుందనుకోలేదు. భాస్కర్ ఎంత హీనంగా మాట్లాడేడో విన్నావు కదా... అయినా అతన్ని అనేందుకు ఏముందిలే...'' అనేశాడు.

పార్వతి మాట్లాడలేదు. ఆడదాని స్థానం మొదలైన చోటనే ఎప్పటికీ కదలకుండా, అక్కడే ఎలా ఘనీభవించి ఉందో కళ్ళ ముందు కనబడుతోంటే చూస్తూ ఊరుకొంది. భాస్కర్ పని కట్టుకొని ప్రచారం చేశాడు. ఇప్పుడు అందరి దృష్టిలోనూ తనో సిగ్గులేని ఆడది. ఇంకో మగాడితో వ్యవహారం పెట్టుకొన్న వ్యవహర్త. పార్వతి పెదవులు బిగబట్టుకొని ఏవీ ఆలోచించకుండా చకచకా పనులు ముగించింది. శశికి బెయిల్ కోసం ప్రయత్నాలు, వ్యవహారం సి.బి.సి.ఐ.డి. దాకా వెళ్ళిపోయి చావుతప్పి కన్ను లొట్టబోయినట్లు చావుదెబ్బలు తిని స్టేషన్ నుంచి బయటపడ్డాడు శశి. లాయర్ దగ్గరా, పోలీసుస్టేషన్‌లోనూ రవి ముళ్ళమీదున్నట్లున్నాడు. ఎన్నిసార్లు మాట్లాడినా ఒకటే విషయం. పార్వతి చిన్నప్పుడు ఎంత నమ్రతగా ఉండేదీ అనే. చిన్నప్పటి పార్వతే అతని దృష్టిలో గుణవతి. మరి ఇప్పుడు? పార్వతికి విరగబడి నవ్వాలనిపించింది. ఇప్పుడు తనకు కొత్తగా పోయిందేమిటి? ఇప్పటివరకూ తనకు ఉందని భ్రమపడ్డ ఓ పంజరం, నిజంగా పోగొట్టుకొంది బానిసత్వపు సంకెళ్ళే.

''సరే నేనింక వస్తాను. నువ్వు అన్నీ తెలిసిందానివి; ఆలోచన గడప దాటి హాస్టల్ వరకూ పోయింది. సరే ఎప్పుడన్నా ఫోన్ చేస్తూ వుండూ...''

అన్నాడు రవి సూట్‌కేస్ సర్దుకుంటూ.

అంతే తనను ఇంటికి కూడా రావద్దంటున్నాడన్నమాట. పార్వతి మాట్లాడలేదు. మాట్లాడకుండా శబ్దం చేయకుండా ఏకాంతంలో బతకటం ఆమెకు అలవాటైన విద్యే. రవి వెళ్ళిపోయాడు. బజార్లో తనకు అవసరమైన వస్తువులు కొనుక్కొని హాస్టల్‌కి తిరిగి వచ్చింది.

గెస్ట్ ఎవరో వచ్చారని వార్డెన్ చెప్పింది.

విజిటర్స్ రూంలో కూర్చుని ఉన్నాడు శశి. చిక్కిపోయి తెల్లగా పాలిపోయిన పార్వతిని

ఆశ్చర్యంగా చూశాడు. వీలైనంత త్వరగా నేను ట్రాన్స్ఫర్ కోసం అప్లై చేస్తాను అన్నాడతను.

పార్వతి ఆశ్చర్యంగా చూసింది.

శశి చిరునవ్వు నవ్వాడు.

ఫరవాలేదు. అంతగా ట్రాన్స్ఫర్ కాకపోతే రిజైన్ చేస్తాను అన్నాడు తొందర తొందరగా. ఎందుకు అన్నది పార్వతి నిదానంగా.

అదేవిటి పార్వతీ. అది నా బాధ్యత అన్నాడు శశి ఆవేశంగా.

పార్వతికి అప్పుడొచ్చింది కోపం.

''నన్ను మీరు అనండి మిస్టర్ శశీ. నేనెవరికీ బాధ్యత కాదు.'' శశి ముఖం రంగులు మారింది.

సారీ మేడమ్. మీ జీవితం ఇంత అస్తవ్యస్తం కావడానికి కారణం నేను. నేను బాధ్యత తీసుకోకపోతే ఇంకెవరు తీసుకుంటారు అన్నాడు ఆశ్చర్యంగా శశి. పార్వతి నవ్వేసింది.

''ఏమనుకుంటున్నారు మిస్టర్ శశీ. ఇట్స్ యాన్ ఆక్సిడెంట్ అంతే. నాకో యాక్సిడెంట్ జరిగింది. కన్నో, కాలో పోయినట్లు నాకు సంబంధించిన జీవితంలో నేను ఉండే అవకాశం లేకుండా పోయింది అంతే కదా. మిస్టర్ శశి మిమ్మల్ని నేను అర్థం చేసుకోగలను. మీ అభిమానం, మీ స్పందన ఇదంతా కేవలం మీకు చెందిన సొంత వ్యవహారం. మీరు సృష్టించుకొన్న కల్పనామయ జగత్తు. అందులో నేనెలా అడుగుపెట్టగలను. మీ ఆలోచనల్లోనూ, మీ ఊహల్లోనూ నాకు భాగస్వామ్యం లేదు. అసలు మిమ్మల్ని గురించి నేనెన్నడూ ఆలోచించలేదు కూడా. ఈ మనిషి లేకుండా నేను బతకలేననే భావన నాకు కలిగితే అప్పుడు అది ఆలోచించవలసిన విషయం. సో ఒకందుకు మీకు నేను రుణపడి ఉంటాను. నాకు అనుభవంలోకి రాని ఓ దివ్యలోకం లోపలికి అడుగుపెట్టేందుకు నాకు అవకాశం కల్పించారు. నమ్మండి. అందులోకి నేను మనస్ఫూర్తిగానే వెలుతున్నా. నా వంటేని, మనసుని గాయపరచిన భాస్కర్ కూడా నాకు ఉపకారమే చేశాడు. నేనో వ్యక్తని నాకు తెలిసింది అన్నది పార్వతి.

మీరన్న దివ్యలోకం ఏమిటి? అన్నాడు శశి.

పార్వతి నవ్వింది.

అదా ''స్వేచ్ఛ''...

నవ్వుతున్న పార్వతి ముఖం వంక చూస్తూ చేతులు జోడించాడు శశి. తూర్పువైపు కిటికీలోంచి ఓ అల్లరి గాలి పార్వతి ముంగురులు ప్రేమగా తాకింది.

★

ఆహ్వానం

నవంబర్ 1996